ఉత్సాహంగా కోడి పందేలు


చింతలపూడి మండలంలో కోడిపందేలు నిర్వహిస్తున్న దృశ్యం


కొయ్యలగూడెం మండలం రామానుజపురంలో కోడిపుంజుల ఢీ


దిప్పకాయలపాడులో బరుల వద్ద పందెం పుంజులతో పందెంరాయుళ్లు

చింతలపూడి : చింతలపూడి నియోజకవర్గంలో సంక్రాంతి మూడు రోజులు కోడిపందేలు ముమ్మరంగా నిర్వహించారు. సంప్రదాయ వేడుకల్లో భాగంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కోడి పందేలను వేశారు. జిల్లాలోని చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా కష్ణా, ఖమ్మం, వరంగల్, తూర్పుగోదావరి, గుంటూరు, కర్నూలు జిల్లాలనుంచి కూడా పందెం రాయుళ్లు వాహనాలలో తరలివచ్చి పందేలలో పాల్గొన్నారు. మండలంలో దూర ప్రాంతాలనుంచి వచ్చే పందెంరాయుళ్ల కోసం టెంట్లు వేసి అన్ని ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా రాత్రిళ్లు ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేసి మరీ పందేలను కొనసాగించారు.

లింగపాలెం: లింగపాలెం మండలంలో పండుగ మూడురోజులు కోడిపందేలు జోరుగా సాగాయి. ములగలంపాడు, శింగగూడెం, అయ్యపరాజుగూడెం, లింగపాలెం గ్రామాల్లోని పామాయిలు, మామిడితోటలల్లో నిర్వహించిన కోడిపందేలకు జిల్లాతోపాటు కష్ణా, ఖమ్మం జిల్లాల నుంచి భారీగా ప్రజలు, పందెగాళ్లు తరలివచ్చారు. అంతేకాకుండా కర్ణాటక, చెన్నై నుంచి పందేలను తిలకించేందుకు వచ్చారు. కొన్ని చోట్ల జూదక్రీడలు నిర్వహిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు వాటిని అడ్డుకున్నారు.

కుక్కునూరు : సంక్రాంతి సందర్భంగా మూడురోజుల పాటు మండలంలో ఏర్పాటు చేసిన కోడిపందేలు సోమవారంతో ముగిశాయి. దాచారం, కివ్వాక, చిరవెల్లి, వేలేరు తదితర గ్రామాల్లో కోడిపందేల జోరుగా సాగాయి. వేలేరులో ఏర్పాటు చేసిన కోడిపందేలకు తిలకించేందుకు మండలం నలుమూలల నుంచే కాక తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి పందేం రాయుళ్లు వచ్చారు. బిరుల వద్ద మద్యం రాయుళ్లు తాగిన మత్తులో గొడవలకు దిగడంతో కొంతమేర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామాల్లో జూదక్రీడలను మాత్రం పోలీసులు అడ్డుకున్నారు.

కొయ్యలగూడెం: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మూడు రోజులుగా నిర్వహించిన కోడిపందేలు సోమవారం సాయంత్రంతో సద్దుమణిగాయి. మండల వ్యాప్తంగా 19 చోట్ల కోడిపందేలు నిర్వహించారు. భోగి, సంక్రాంతి రెండు రోజులు కోడిపందేలు కొనసాగాయి. కనుమ సందర్భంగా పందేలు, జూద క్రీడలు నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు దాడులు చేసి జూద క్రీడలను అడ్డుకున్నారు. ఆదివారం రాత్రి డీఎస్పీలతాకుమారి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది విస్తృత దాడులు నిర్వహించారు. రాత్రులు కూడా పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించినట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ పేర్కొన్నారు.


లింగపాలెం మండలంలో కోడి పందేలను తిలకించేందుకు వచ్చిన ప్రజలు


వేదాంతపురంలో ఢీకొంటున్న పందెంకోళ్లు


లింగపాలెం మండలంలో కోతముక్క ఆటల కోసం చేసిన ఏర్పాట్లను తొలగించిన పోలీసులు

జూద క్రీడలపై పోలీసుల దాడి

ద్వారకాతిరుమల: సంక్రాంతి పండుగ మూడు రోజులు కోడి పందేలు, పేకాట, గుండాటలు నిర్వహించిన పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ తెలిపారు. తొమ్మిది కోడి పందేల స్థావరాలపై దాడిచేసి, 24 మందిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.11,250 లు నగదు, 9 కోళ్లు, 25 కత్తులను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే నాలుగు పేకాట స్థావరాలపై దాడిచేసి, 9 మందిపై కేసు నమోదు చేసి, రూ.4,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా ఏడు గుండాట స్థావరాలపై దాడిచేసి, 15 మందిపై కేసు నమోదు చేసి, వారి వద్ద నుంచి 7,450 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇదిలా ఉంటే పండుగ మూడు రోజులు మండలంలో కోడి పందేలు జోరుగా సాగాయి. ద్వారకాతిరుమల, తిమ్మాపురం, తిరుమలంపాలెం గుణ్ణంపల్లి, ఎం.నాగులపల్లి, రాళ్లకుంట, దొరసానిపాడు, జి.కొత్తపల్లి గ్రామాల్లో పందేలు భారీగా జరిగాయి.

మొండికోడులో సంక్రాంతి కలిపింది అందరినీ


సంక్రాంతి సందర్భంగా మొండికోడులో కలిసిన కలిదిండి కుటుంబ సభ్యులు

ఏలూరు రూరల్: సంక్రాంతి పండుగ బంధువుల మధ్య అనుబంధాలు, ఆప్యాయతను మరోసారి గుర్తుచేసింది. ఆదివారం ఏలూరు మండలం మొండికోడు గ్రామానికి చెందిన మూడు తరాల కలిదిండి కుటుంబ సభ్యులు కలుసుకున్నారు. మాజీ సర్పంచ్ కలిదిండి అప్పలరాజు ఆధ్వర్యంలో సుమారు 200 మంది సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యువకులు పెద్దలను సత్కరించారు. పెద్దలు పిల్లలకు కానుకలు, పిండివంటలు చేసి పెట్టారు. అందరూ కలిసి ఉత్సాహంగా పండుగ చేసుకున్నారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయాల్లో మకర జ్యోతి దర్శనం


గుండుగొలనులో అయ్యప్ప స్వామి వారిని విశేషంగా అలంకరించిన దృశ్యం

భీమడోలు: గుండుగొలనులో శ్రీధర్మశాస్త్ర ఆలయంలో కొలువైన అయ్యప్ప స్వామి వార్ల ఆదివారం రాత్రి మకర జ్యోతి దర్శన వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి వారికి వివిధ రకాల పువ్వులతో విశేషంగా అలకరించి ముస్తాబు చేసారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతోఅలంకరించారు. ఆలయ పూజారులు లంకా శివకుమార్, లంకా శ్రీనివాస్ ఆధ్వర్యంలో మకర సంక్రాంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేసారు. మకర జ్యోతిని ఆకాశంలోకి వదిలిన ఈ ఘట్టాన్ని పరిసర గ్రామాలకు చెందిన భక్తులు తిలకరించి ఆనందించారు. పూళ్లలోని అయ్యప్ప స్వామి ఆలయంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ పుప్పాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మకర జ్యోతి దర్శనం కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయంలోని స్వామి వారి ఆభరణాలతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ఆభరణాలను అలంకరించారు. భారీగా బాణసంచా కాల్చారు. 18 దీపాలను వెలిగించి భక్తులు పూజలు చేసారు. దీనితో ఆలయాల్లో స్వామి వార్లను దర్శించుకునేందుకు ప్రజలు బారులు తీరారు. ఈ కార్యక్రమాల్లో గ్రామస్తులు, మహిళలు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీసీ రోడ్డు ప్రారంభం


సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న వృద్ధి ఇన్‌ఫ్రా యాజమాన్యం

జంగారెడ్డిగూడెం : పారిజాతగిరి వద్ద భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును వృద్ధి ఇన్ఫ్రా అధినేత కావూరు సురేష్, రాంబాబు, నాగభూషణం ప్రారంభోత్సవం చేశారు. పాత రోడ్డుకు అనుసంధానంగా రూ. 15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డును ఏర్పాటు చేశారు. కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డు మలుపు వద్ద ప్రమాదాల నివారణ కోసం ఈ రోడ్డు నిర్మించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎం.రాంబాబు, ప్రధానార్చకులు రవికుమారాచార్యులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో లలితా పారాయణం


చింతాలమ్మ ఆలయం వద్ద లలితా పారాయణం చేస్తున్న భక్తులు

కొయ్యలగూడెం : మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కనుమ రోజు సోమవారం కొయ్యలగూడెం గ్రామదేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద లలితా సహస్రనామ పారాయణ నిర్వహించారు. రైతు అభ్యుదయ సంఘం, ఆలయ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొని అమ్మవారిని స్తుతిస్తూ పారాయణం చేశారు. ఐదు రోజులపాటు అమ్మవారి ఆలయం వద్ద సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలి


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ సీతాదేవి

బుట్టాయగూడెం : సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని గిరిజన యువత సంప్రదాయ క్రీడలను నిర్వహించుకోవడం ఆనందదాయకమని ఏఎంసీ చైర్మన్ కరాటం సీతాదేవి అన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా జరిగిన ఆటల పోటీల ముగింపు కార్యక్రమంలో ఆమె సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సీతాదేవి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోర్సా గంగరాజు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పెద్దిరెడ్డి మూర్తి, కమిటీ సభ్యులు కోర్సా రామకృష్ణ, రాంబాబు, మంగబాబు, తెల్లం రమేష్, గోగుల రవి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతర ప్రారంభం


యండగండి పోలేరమ్మ జాతరలో పిల్లలపైనుంచి దాటుతున్న గణాచారి

ఉండి: యండగండిలో పోలేరమ్మ అమ్మవారి రెండు రోజుల జాతర ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆయా ప్రాతాల నుంచి విచ్చేసిన బంధువులు, గ్రామ ప్రజలు జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునే భక్తులు ఘటాలు ఇవ్వడం జరిగింది. ఘటాలు ఎత్తుకుని రోడ్డుపై వెళుతున్న గణాచారులకు రోడ్డుపై చీరలు పరచి ఆ చీరలపై చిన్నారులను ఉంచి వారిపై నుంచి గణాచారి దాటి వెళితే బిడ్డలకు మంచి జరుగుతుందని ఈ ప్రాంత ప్రజల నమ్మకం. అనంతరం నడివీధిలో అమ్మవారిని ఉంచి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే మంగళవారం అమ్మవారిని పుట్టింటికి పంపే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

నేడు రైతన్నల ఖాతాల్లోకి రూ.200 కోట్లు బదిలీ

దెందులూరు: అన్నదాతలకు సంక్రాంతి పండుగ ఆనందాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నింపారని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరించిన 22 రోజులలోపే రైతుల ఖాతాల్లో రూ. 4813 కోట్లు జమ చేశారన్నారు. రికార్డు స్థాయిలో 25.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారని తెలిపారు. నేడు రైతన్నల ఖాతాలకు రూ.1,500 కోట్లు బదిలీ చేయనున్నారు. రైతు పక్షపాతి సీఎంగా జగనన్న నిలబడి ఎన్నో సంక్షేమ అభివృద్ధి పథకాలు అందిస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పటి వరకు రాష్ట్రంలో 25.93 లక్షల టన్నుల ధాన్యాన్ని చేసినట్లు తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దళారీ, మిల్లర్ల పాత్ర లేకుండా ధాన్యం కొనుగోలు చేసి, హమాలీ, గన్ని, రవాణా చార్జీలు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందన్నారు. జగనన్న నాయకత్వంలో ఏపీలో వ్యవసాయం పండుగలా మారిందని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు.

ఊరూవాడా సంక్రాంతి సందడి


రెడ్డిగణపవరంలో విజేతలకు బహుమతులను అందజేస్తున్న డీఎస్పీ లతాకుమారి


చెంచుగూడెంలో ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతుల అందజేత

బుట్టాయగూడెం : సంక్రాంతి పల్లెల్లో సందడి చేసింది. ఊరూ వాడా వేడుకగా మారింది. తెలుగింటి ఆడపడుచులు, చిన్నారులు, పెద్దలు సంక్రాంతిని సంబరంగా జరుపుకున్నారు. భోగి మొదలుకుని సంక్రాంతి, కనుమ వరకూ సంబరాలు అంబరాన్నంటాయి. కొత్త అల్లుళ్లు, ఆడపడుచులు, బంధువులతో ఇళ్లు కళకళలాడాయి. మహిళలు పిండి వంటలు చేసే పనిలో నిమగ్నమవ్వగా యువతులు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే యువకులు వాలీబాల్, కబడ్డీ పోటీల్లో పాల్గొని ఉత్సాహంగా ఆడారు. రెడ్డిగణపవరంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో డీఎస్పీ కె.లతాకుమారి చేతుల మీదుగా ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, నిర్వాహకులు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు బుద్దుల జలపాలరాయుడు ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం, రెడ్డిగణపవరంలో సంక్రాతి పండగను పురస్కరించుకొని యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీలు ముగిశాయి. మూడు రోజుల పాటు ఉత్సాహంగా గ్రామాల్లో వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి నిర్వాహకులు బహుమతులను అందజేశారు.

ముగిసిన యువజనోత్సవాలు


పాత చింతలపూడిలో నిర్వహించిన ముగ్గుల పోటీలు

చింతలపూడి : పండగల పేరుతో యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా క్రీడలు దోహదపడతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణ చైతన్య అన్నారు. స్థానిక పాత చింతలపూడిలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన యువజనోత్సవాలు సోమవారం ముగిశాయి. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కబడ్డీ, పరుగు పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తొర్లపాటి బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. యువత జూదాల జోలికి పోకుండా వాలీబాల్, రన్నింగ్, ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె.గురవయ్య, పి.సోమశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముళ్ళగిరి ఇమ్మానియేలు, పల్లే పరదేశి, కంభం సుజాత, బోడ వజ్రం తదితరులు పాల్గొన్నారు.

పుంతలో ముసలమ్మ 50వ వార్షికోత్సవం


పూలతో అలంకరించిన పుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయం

నిడమర్రు: బావాయిపాలెం పుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు ఈనెల 16 నుంచి 22వ తేదీ వరకూ నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ముత్యాల పెదబాబు తెలిపారు. వార్షికోత్సవాలు ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతిరోజూ ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, మ్యూజికల్ నైట్, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని, ఆలయాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలు చేసి శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా 22వ తేదీ ఆదివారం మాంసాహారంతో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా సోమవారం అమ్మవారికి గ్రామస్తులు భారీ ఊరేగింపుతో చలిమిడి పానకాల తెచ్చారు. బ్యాండుమేళాలతో గ్రామస్తులు కావిళ్లతో ప్రదర్శనగా గ్రామంలోని శివాలయం వద్ద నుంచి ఊరిచివర ఉన్న పుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాలనుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

హరిలో రంగ హరి

ఆకివీడు: వంశపారంపర్య వృత్తిగా హరిదాసు వృత్తిని వదులుకోలేకపోతున్నామని, సంస్కృతిని కాపాడాలనే ఉద్దేశంతో పండుగ రోజుల్లో గ్రామాల్లో తిరుగుతున్నామని హరిదాసు పరంకుశం రాంబాబు చెప్పారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో సంక్రాంతి పండుగ ముగింపు సందర్భంగా ఆయా ఇళ్లవద్దకు వెళ్లి 'శ్రీమద్రామాయణ గోవిందో హరి' అంటూ పండుగ ముగిసిందని చెబుతూ ఇంటింటికీ తిరుగుతున్నారు. నాలుగు తరాలుగా హరిదాసు వృత్తిని కొనసాగిస్తున్నామని, నెల పట్టిన రోజుల్లో గ్రామం అంతా తిరిగి ప్రదిక్షణలు చేస్తామని చెప్పారు. తన ముత్తాత కుప్పనపూడి గ్రామంలో హరిదాసుగా పనిచేశారని, తాత, తండ్రి ఇదే ప్రాంతంలో సంక్రాంతి పండుగను ప్రజలతో పంచుకున్నారని చెప్పారు. బతుకుతెరువు కోసం గ్రామం వదలి అమరావతిలో కాపురం ఉంటున్నామని, అక్కడ నుంచి ప్రతి సంక్రాంతి పండుగ నెల రోజులూ గ్రామంలోనే ఉంటామని చెప్పారు. గ్రామస్తులు పెద్ద మనస్సుతో అన్ని విధాలుగా ఆదుకుంటున్నారన్నారు. గత 30 ఏళ్లుగా హరిదాసుగా పని చేస్తున్నట్లు రాంబాబు వివరించారు.

30 పడకల సీహెచ్‌సీ ప్రారంభోత్సవానికి సిద్ధం


దెందులూరులో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న 30 పడకల సీహెచ్‌సీ

దెందులూరు: దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి సహాయసహకారాలతో నియోజకవర్గం ముఖ్య కేంద్రమైన దెందులూరు నియోజకవర్గంలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) నిర్మితమైంది. 24 గంటలూ వైద్యసేవలందించేలా డిప్యూటీ సివిల్ సర్జన్, ఐదుగురు వైద్యులతో రోగులకు వైద్యసేవలందించేందుకు 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే మంజూరు చేయించి నిర్మాణం పూర్తి చేయించారు. ఇకపై దెందులూరు సమీప గ్రామాల్లో ప్రజలకు 24 గంటలు పాటు వైద్యసేవలు పూర్తి సౌకర్యాలతో అందుబాటులోకి రానున్నాయి.

వైభవంగా గోదాదేవి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో గోదాదేవి


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

దెందులూరు: దెందులూరులోని విష్ణులాయంలో సోమవారం గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో కల్యాణాన్ని తిలకించారు. తొలుత ఆలయ అర్చకులు గోదాదేవికి వివిధ పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. చిన్నారుల నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన


కూచిపూడి నృత్య ప్రదర్శన

భీమవరం (ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి వార్షికోత్సవాల్లో భాగంగా సంక్రాంతి రోజు అమ్మవారి కళావేదికపై ఏర్పాటు చేసిన శ్రీ మయూరి నృత్యాలయం హైదరాబాద్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యప్రదర్శన భక్తులను అలరించింది. కూచిపూడి నృత్యకారిణి దొంగ అనిషిత కూచిపూడి నృత్య అభినయాన్ని ప్రశంసించారు. అలాగే జగత్ విజేత నాట్యమండలి మిలట్రీ మాధవరం ఆధ్వర్యంలో ప్రదర్శించిన కనకదుర్గ మహత్యం నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. అలాగే సోమవారం పిప్పళ్ల ప్రసాద్ భీమవరం వారిచే సాయి సంకీర్తనలు, శ్రీమావుళ్లమ్మవారి నాట్యమండలిచే ప్రదర్శించిన రంగస్థల ఆణిముత్యాలు నాటకం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నీరుల్లికూరగాయ పండ్ల వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారి ఉత్సవాల్లో..

నేడు మావుళ్లమ్మవారి వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 5 గంటలకు భరత నాట్యం, 6 గంటలకు సినీ మ్యూజికల్ నైట్, 8 గంటలకు శ్రీ తిరుపతమ్మ మహత్యం నాటకం కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు.